క్లుప్తంగా

కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్న ప్రచారం నేడు

కోవూరు : స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం తూర్పు అరుంధతీయవాడ, చుండుగుంట, విఘ్నేశ్వరపురం, రామనాథపురం, చెర్లోపాళెం, పాటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం చెప్పారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సజావుగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

• కలెక్టర్ హరినారాయణన్

కోవూరు : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా సాగుతోందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. కోవూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాలను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. కోవూరు నియోజకవర్గానికి సంబంధించి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,589 మంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సంజన సింహా, కోవూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్, మున్సిపల్ కమిషనర్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు 608 ఓట్ల పోల్

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గానికి సంబంధించి వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 608 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,268 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉండగా తొలిరోజు 387, రెండోరోజు 608 కలిపి మొత్తం 995 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన 273 మంది ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నెల్లూరు (క్రైమ్): ఎన్నికల్లో అక్రమ మద్యానికి అడుకట్టవేసేందుకు పోలీసు, సెబ్ అధికారులు తనిఖీలు విస్తృతం చేశారు. సోమవారం అల్లూరులో 17, వింజమూరులో 12, వరికుంటపాడులో 12, సెబ్ అధికారులు ఇతర రాష్ట్రాలకు చెందిన 192, మన రాష్ట్రానికి చెందిన 162 మొత్తంగా 395 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసులు నమోదు చేశారు. వరికుంటపాడులో 1100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాలను ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం వస్తే సంబంధిత విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి, పలువురు విద్యుత్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మరో 20 ఏళ్లు వైఎస్ జగనే సీఎం



మంత్రి కాకాణిని గజమాలతో సత్కరిస్తున్న కోడూరు నేతలు, కార్యకర్తలు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : తూర్పున సూర్యుడు ఉదయించి పడమరన అస్తమించడం ఎంత సత్యమో మరో 20 ఏళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండడం అంతే సత్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ కోడూరులో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కావల్‌రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో తీర ప్రాంత కోడూరు వాసులు మంత్రి కాకాణికి జేజేలు పలికారు. పాముదొరువు కండ్రిగ నుంచి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి దాదాపు 14 మజరా గ్రామాల్లో తిరిగి ప్రజల ఆశీస్సులు కోరారు. ఈ క్రమంలో కోడూరు తీర ప్రాంత వాసులు మంత్రి కాకాణికి ఘన స్వాగతం పలికి మద్దతు పలికారు. ముఖ్యంగా తీరప్రాంత గ్రామాలైన ముత్యాలతోపు, వెంకటేశ్వరపాళెం, నడింపాళెం, రవీంద్రపాళెం, పాతపాళెం గ్రామాల్లోని మత్స్యకారుల నుంచి మంత్రి కాకాణికి అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ వలంటీర్లు ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తే ఎక్కడ ఇబ్బంది కలుగుతుందోనని భయపడి ఎన్నికల కమిషన్‌ను ద్వారా అడ్డుకున్న ఘనుడు చంద్రబాబు అని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే వలంటీర్ల ద్వారా ఇళ్లకు పింఛన్లు అందించే కార్యక్రమం మీద మొదటి సంతకం పెడుతారన్నారు. 2024 ఓటమితో సోమిరెడ్డి రాజకీయ జీవితం ముగిసిపోతుందన్నారు. వరుస ఓటములతో అసహనంలో ఉన్న సోమిరెడ్డి ఏం మాట్లాడుతున్నాడో అతనికే అర్థం కావడం లేదన్నారు. గతంలో ఆయన మంత్రిగా సర్వేపల్లికి ఏం చేశాడో చెప్పలేక తనపై లేనిపోని విమర్శలు గుప్పిస్తున్నాడన్నారు. నాలుగు దఫాలు సర్వేపల్లి ప్రజల తిరస్కారానికి గురైనా అడ్డదారిన మంత్రి పదవి పొందిన సోమిరెడ్డి నాడు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతి అక్రమాలతో రూ.వందల కోట్లు దోచేశాడన్నారు. కరోనా కష్టకాలంలో తాను ప్రజల వెన్నంటి ఉంటే సోమిరెడ్డి పక్క రాష్ట్రాలకు పారిపోయినట్లు తెలిపారు. అటువంటి సోమిరెడ్డిని గెలిపిస్తే సర్వేపల్లి ప్రజలను నట్టేట ముంచుతాడన్నారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, వైస్ ఎంపీపీ సీలమ్మ, స్థానిక నాయకులు విశ్వనాథరెడ్డి, వేణు, శ్రీరాములు, దుర్గ, శేషు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇస్కపాళేనికి రూ.21.97 కోట్ల లబ్ధి



ఇస్కపాళెం పంచాయతీ పోలినాయుడుచెరువు గ్రామంలో ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలు కాలనీల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.21.97 కోట్ల లబ్ధి చేకూరిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్కపాళెం మజారా గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి పలువురు నాయకులను సంతలో పశువులను కొన్నట్లు కొంటోందని విమర్శించారు. కొందరు నాయకులు డబ్బుకు ఆశపడి అమ్ముడుపోయినా నిజమైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తమ వెంట ఉన్నారన్నారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రూ.2 కిలోబియ్యం పథకాన్ని చంద్రబాబు రద్దు చేసి 1995 నుంచి 2004 వరకు రూ.5.25లకు విక్రయించాడన్నారు. దివంగత ఎన్టీఆర్‌ను దారుణంగా అవమానించిన వ్యక్తి ప్రజలను మోసం చేయడం ఒక లెక్క అని తెలిపారు. డ్వాక్రా మహిళలకు, రైతులకు సున్నావడ్డీకే రుణాలు ఇస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డికి రాజకీయంగా ఎలాంటి అవగాహన లేదన్నారు. కేవలం డబ్బుతో ప్రజలను కొనాలని చూస్తున్నారన్నారు. వారి మాటలు నమ్మకుండా ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడూరు మధుసూదన్‌రెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

మనుబోలు : మండలంలోని బద్దెవోలు పంచాయతీలో ఉన్న గ్రామ వలంటీర్లందరూ సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మొత్తం పది మంది వలంటీర్లు ఉండగా గతంలో ఒకరు రాజీనామా చేయగా మిగిలిన తొమ్మిది మంది తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి చెంచుకృష్ణయ్యకు అందజేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి ఏర్పాటు చేసుకునేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. గ్రామ సర్పంచ్ శశికుమార్‌రెడ్డి వారిని అభినందించారు.



రాజీనామా పత్రాలను ఇస్తున్న వలంటీర్లు

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం మండలంలోని నందివాయ, అయ్యగారిపాళెం, చాటగొట్ల, మరుపూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి సోమవారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రౌడీషీటర్‌ను ఏజెంట్‌గా ఎలా అనుమతిస్తారు?

వెంకటాచలం: పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదై, రౌడీషీటర్‌గా ఉన్న వ్యక్తిని ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్‌గా ఎలా అనుమతిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య అధికారులతో వాగ్వాదానికి దిగారు. సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతోంది. అయితే సోమవారం ఈ పోలింగ్ కేంద్రానికి టీడీపీ తరఫున ఏజెంట్‌గా రౌడీషీటర్ సండి రమేష్ వచ్చాడు. దీంతో వైఎస్సార్‌సీపీ తరఫున ఏజెంట్‌గా ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఎన్నికల విధులు నిర్వహించే అధికారులతో వాగ్వాదానికి దిగారు. రౌడీషీటర్‌ను ఏజెంట్‌గా నియమించడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సీఐ అంకమరావు అక్కడకు చేరుకుని రౌడీషీటర్ సండి రమేష్‌ను పోలింగ్ కేంద్రం నుంచి బయటకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు

• ఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకై నిర్దేశించిన మోతాదులో ఉన్న ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తులను వినియోగించాలని, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా కాలువల్లో పూడికతీత పనులను స్పెషల్ డ్రైవ్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. పనుల పరిశీలనలో భాగంగా స్థానిక 8వ డివిజన్ తడికలబజార్, అరుంధతీయవాడ ప్రాంతాలలో జరుగుతున్న పనులను సోమవారం డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో ప్రతిరోజూ నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు నిర్వహిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మోతాదు కలిగిన ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, నిల్వ, విక్రయం, కొనుగోలు చట్ట వ్యతిరేకమైన చర్యలు అని తెలిపారు. ప్రజలంతా బాధ్యతగా జౌళి, నార, గుడ్డ సంచులను తమ వెంట ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని సూచించారు.



కాలువలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన జొన్నవాడ ఎస్టీకాలనీ వాసులతో ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన వంద కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ప్రసన్న వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిఒక్కరికి తగిన గౌరవం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేత బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జనసేనకు చెందిన 50 మంది యువకులు ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం మండలంలోని పోలినాయుడు చెరువు గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ టీడీపీ, బీజేపీకి అమ్ముడుపోయిందన్నారు. కార్యకర్తలను పట్టించుకోకుండా టీడీపీకి ఊడిగం చేసే జనసేనలో ఇమడలేక వైఎస్సార్‌సీపీలో చేరామని వివరించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

పెద్దాస్పత్రిలో అన్నదానం

నెల్లూరు(అర్బన్): వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ అసోసియేషన్ సభ్యుడు ఉమామహేశ్వరరెడ్డి తన మనవరాలు హన్వికరెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. సోమవారం దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో ఉన్న సత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా రోగుల సహాయకులు 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ, నాయకులు రమేష్‌బాబు, రవిచంద్ర, రాఘవేంద్రశెట్టి, సుబ్బరామిరెడ్డి, నారాయణరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనకు అండగా నిలవాలి

వెంకటాచలం : అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న పాలనకు ప్రజలు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య కోరారు. మండలంలోని ఎర్రగుంటలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మరోసారి గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అభివృద్ధితో పాటు, అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు తాటిపర్తి సురేష్, నరేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు, బిరదవోలు పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు గురించి ఓటర్లకు వివరించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాతం పెంచలరెడ్డి, వై.పెంచలరెడ్డి, నారాయణ, శ్రీరాములు, ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, ఇంద్రసేన్‌గౌడ్, లక్ష్మణరెడ్డి, ఆకుల గంగిరెడ్డి, బడుగు శ్రీనివాసులు, శ్రీహరి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మైపాడులో..

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడులో వైఎస్సార్‌సీపీ నేత గజ్జల లింగారెడ్డి, సర్పంచ్ సంగం వెంకయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు.



వెంకటాచలం: తిరుమలమ్మపాళెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజిత



ఇందుకూరుపేట: మైపాడులో..



వెంకటాచలం : ఎర్రగుంటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వెంకటశేషయ్య

అభివృద్ధి చూసి ఆదరించండి

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లిలో చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలని ఆయన కుమార్తె కాకాణి పూజిత కోరారు. మండలంలోని ఇడిమేపల్లి, తిరుమలమ్మపాళెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు.

ఐదేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడే వారికి మద్దతు ఇవ్వాలని కోరారు.

సోమిరెడ్డి ఓటమి ఖాయం

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓటమి దాదాపు ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం పంచాయతీకి చెందిన 150 మంది సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో వారికి కాకాణి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరిగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వలసలు అధికమైందని తెలిపారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీ కనుమరుగయ్యే స్థితికి చేరుకుందన్నారు. టీడీపీ నుంచి వస్తున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత న్యాయం చేసి అన్నిరకాలుగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరవళ్లూరు ఈశ్వరయ్య, దువ్వూరు నారాయణరెడ్డి, దద్దోలు వెంకటకృష్ణయ్య, తిరవళ్లూరు వెంకటేశ్వర్లు, దద్దోలు రాధయ్య, నెల్లూరు లక్ష్మణ్, కె.మురళీ, బి.మోహన్, కె.శీనయ్య, ఇ.ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

ఇస్లాంపేట నుంచి 20 కుటుంబాల చేరిక

వెంకటాచలం: మండలంలోని ఇస్లాంపేట గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీని వైఎస్సార్‌సీపీలో చేరాయి. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆదివారం రాత్రి నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి జగనన్న ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని ప్రకటించారు. దీంతో మంత్రి కాకాణి వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

జట్లకొండూరు నుంచి..

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు అరుంధతీయవాడ నుంచి పలు ఎస్సీ కుటుంబాల వారు ఉపసర్పంచ్ ఆవుల తులసీరాం, కసుమూరు పెంచలయ్య ఆధ్వర్యంలో టీడీపీని వీడి నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి కాకాణి తమ గ్రామంలో సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, పొలాలకు డొంకలు, శ్మశానానికి మార్గం, హ్యాండ్ బోర్‌లు, డీకేటీ పట్టాలు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ తదితరాలను ఏర్పాటు చేయించారన్నారు. కరోనా కష్టకాలంలో సోమిరెడ్డి ముఖం చాటేస్తే, కాకాణి అండగా నిలిచి సాయం అందించారని తెలిపారు. ఈసారి కాకాణిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.



వెంకటాచలం: వైఎస్సార్‌సీపీలో చేరిన ఇస్లాంపేట గ్రామస్తులు



మనుబోలు : వైఎస్సార్‌సీపీలో చేరిన జట్లకొండూరు వాసులు



పొదలకూరు : మొగళ్లూరులో..



పొదలకూరు : బిరదవోలులో..